లోక రక్షకుడు ఏసు

● ఘనంగా రన్ ఫర్ జీసస్

కర్నూలు (టౌన్): సమస్త మానవాళి లోరక రక్షకుడు ఏసు క్రీస్తు పలువురు వక్తలు అన్నారు. ఈస్టర్ ఫెస్టివల్ భాగంగా ఈవాంజికల్ సోల్జర్స్ టీమ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో రన్ ఫర్ జీసస్ ఘనంగా నిర్వహించారు. కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈరన్‌ను ప్రారంభించిన వారు మాట్లాడుతూ రన్ ఫర్ జీసస్ పేరుతో ఏసుక్రీస్తు మరణ పునరుత్థానం జ్ఞాపకం చేసుకొవడం హర్షణీయమన్నారు. ఏసు క్రీస్తు చూపిన మార్గంలో ప్రేమ, దయ, శాంతి సమాధానంతో ప్రజలు సుఖ శాంతులతో కలిసి సమాజంలో ముందుకు వెళ్లాలని తెలిపారు. సిటీ పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్ ఆర్ఆర్‌డీ సజీవరాజు మాట్లాడుతూ ఏటా కర్నూలు నగరంలో ఈ రన్ ఫర్ జీసస్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీ కోల్స్ చర్చి నుంచి ప్రారంభమై సీ. క్యాంపు ప్రార్థన మందిరం వరకు సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ దాసరి సుధీర్, సీటీ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు జాన్ విల్సన్, ఆనందరావు, రవికుమార్, జయకుమార్ జయపాల్, రమేష్, విజయకుమార్, మోజస్ పాల్గొన్నారు. అంతకు ముందు స్టాంటన్ చర్చి మెయిన్ సర్వీస్ బాలికలు నిర్వహించిన ప్రదర్శన అందరినీ అకట్టుకుంది. అనంతరం బెలూన్లను గాలిలో వదిలారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ నాగరాజు, క్రైస్తవులు


నగరంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


వై.రాజు, నవీన్, రామ్ మనోహర్, నానాజీ నాయక్

కల్లూరు: జేఈఈ మెయిన్స్ ఫేస్-2 ఫలితాల్లో చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ, మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థులు సత్తాచాటారు. అకాడమీ నుంచి మొత్తం 65 మంది విద్యార్థుల్లో 61 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025కు అర్హత సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప శనివారం తెలిపారు. ఎరుకల రాజు (93.84), నవీన్ (97.61), రామ్ మోనోహర్ (96.81), నానాజీ నాయక్ (87.8) పర్సంటైల్ సాధించారని తెలిపారు. ప్రభుత్వ సౌకర్యాలు, విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వంతో మంచి ఫలితాలు సాధించారని ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయ కర్త శ్రీదేవి తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి సాంస్కృతిక వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు సాంస్కృతిక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వజ్రోత్సవాలను పురస్కరించుకుని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 6 గంటలకు అవధాని కళారత్న ఆముదాల మురళిచే అష్టావధానం, 21వ తేదీన జగదేక సుందరి సామ పద్య నాటక ప్రదర్శన, 22న శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటక ప్రదర్శన, 23న తరమెల్లి పోతున్నదో సాంఘిక నాటక ప్రదర్శన, 24న మహమ్మద్ మియ్యా, సుధారాణిలచే జానపద సినిమా గజల్స్ సంగీత విభావరి, 25న డ్యాన్స్ మాస్టర్స్ కరీముల్లా, రోహిత్, ప్రదీప్, నారాయణస్వామిచే జానపద, శాస్త్రీయ నృత్యాల లహరి, 26న శ్రీ వెంకటేశ్వర మహత్యం నాటక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు

కర్నూలు (టౌన్) : అస్సాం రాష్ట్రం గౌహతిలో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళా పోటీల్లో జిల్లాకు చెందిన నలుగురు మహిళా క్రీడాకారులు ఎంపికైనట్లు రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు వెల్లడించారు. శనివారం స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో జాతీయ పోటీలకు ఎంపికయిన ఎలీషా (కోడుమూరు) నాన్సీ (మంత్రాలయం) శృతి (కర్నూలు) రజిత (కర్నూలు)ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన


రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కర్నూలు: రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు జిల్లా అంతటా విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు భద్రతపై ప్రతి శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా అంతటా పోలీసులు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు.

కానిస్టేబుల్ హత్య కేసు నిందితుల అరెస్టు

ఆళ్లగడ్డ: నల్లమల అడవి బొగద సమీపంలో ఇటీవల జరిగిన కానిస్టేబుల్ ఫరూక్ (32) హత్య కేసును పోలీసులు ఛేదించారు. కానిస్టేబుల్ ప్రియురాలు హనీఫా కూతురు ప్రియుడు షేక్ షబ్బీర్‌బాషాతో పాటు మరో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు..కోటకందుకూరు గ్రామానికి చెందిన ఫరూక్ అక్టోఫస్ కానిస్టేబుల్‌గా మంగళగిరిలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి హనీఫా అనే మహిళతో వివాహేతర సంబంధం ఉండటంతో నంద్యాల సమీపంలోని నందమూర్‌నగర్‌లో ఇల్లు బాడుగకు తీసుకుని సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో హనీఫా కూతురిపై కూడా కన్నేసిన అతను ఆ యువతిని మానసికంగా శారీరకంగా వేధించసాగాడు. అయితే ఆ యువతి ఫరూక్ స్నేహితుడైన షబ్బీర్ బాష అనే యువకుడిని ప్రేమించడంతోపాటు వారు పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసిన ఫరూక్ ఆ యువకుడిని బెదిరించాడు. దీంతో ఎలాగైనా ఫరూక్‌ను షబ్బీర్ అడ్డుతొలగించుకోవాలనుకున్నాడు. ఈనెల 8వ తేదీ ఫరూక్ నంద్యాలకు వచ్చాడన్న విషయం తెలుసుకుని షబ్బీర్ ప్లాన్ ప్రకారం కారు తీసుకెళ్లాడు. బయటకు వెళ్దామంటూ ఫరూక్‌ను ఆ కారులో ఎక్కించుకుని స్నేహితులైన మరో నలుగురిని బైక్‌లపై ఫాలో కావాలని చెప్పాడు. వారు కారు వెంట వెళ్లి అయ్యలూరు మెట్ట ప్రాంతంలో తాడును గొంతుకు బిగించి కారులోనే హత్య చేసి మృతదేహాన్ని చాగలమర్రి మండలం బైరవగుండాల్లో పడేశారు. శవం తేలితే విషయం బయటకు వస్తుందని 10వ తేదీ మృతదేహాన్ని నల్లమల అడవిలోని పాత బొగద సమీపంలో లోయలో పడేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న మంగళగిరి పోలీసులు నంద్యాల పోలీసులతో కలిసి కేసును ఛేదించారు. నిందితులు మృతదేహాన్ని చూపించారు. నిందితులు షేక్ షబ్బీర్, సయ్యద్ రియాజ్, అబ్దుల్లా, షేక్ అబ్దుల్, ఫాజిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అంబేడ్కర్‌తో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ రాజకీయాలు

● రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

కర్నూలు కల్చరల్: ఓటుబ్యాంక్ రాజకీయాలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ వాడుకుంటుందని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ అన్నారు. అంబేడ్కర్ జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని మౌర్యా ఇన్ పరిణయ ఫంక్షన్ హాల్‌లో శనివారం మేధావుల సదస్సు జరిగింది. మంత్రితో పాటు మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, బీజేపీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో అంబేడ్కర్ నిలబడితే ఓడించడంతో రాజ్యాంగాన్ని వందల సార్లు సవరించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంబేడ్కర్‌కు సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో పంచతీర్థను ఏర్పాటు చేశారన్నారు. బీజేపీ ఎస్సీలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. దేశ, రాష్ట్రాల అత్యున్నత పదవుల్లో బడుగు బలహీన వర్గాల వారే ఉన్నారన్నారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ చరిత్రలో గుర్తుపెట్టుకోవాల్సిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. గత ప్రభుత్వాలు తీసుకున్నటువంటి నిర్ణయాలతో దేశానికి ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సరిదిద్దుతూ దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రమ్మ, బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రమౌళి, కపిలేశ్వరయ్య, విట్టా రమేష్, వినూషారెడ్డి, పురుషోత్తం రెడ్డి, నగరూరు రాఘవేంద్ర, జిల్లా అధ్యక్షులు రామకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటండి


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్ డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం అక్బర్‌పూర్‌లో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు జరిగే 47వ జాతీయ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు, ఆంధ్రప్రదేశ్ జట్టుకు పేరు తీసుకురావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని తన చాంబర్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన హ్యాండ్ బాల్ క్రీడాకారులు జగదీష్, రియాజ్, సాగర్, భువనేశ్‌లను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్

పగిడ్యాల: 'గురుకుల పాఠశాలలో ఎలుకల బెడద' అనే శీర్షికపై శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై డీసీఓ డాక్టర్ ఐ.శ్రీదేవి పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఉండే డార్మెటరీ భవనాన్ని పరిశీలించారు. ఎలుకల దాడికి గురైనట్లు అనుమానం ఉన్న పిల్లలందరికీ డాక్టర్లతో యాంటిబాటిక్ ఇంజెక్షన్లు వేయించారు. అనంతరం ఆమె ప్రిన్సిపాల్ రమణమ్మ, పాఠశాల సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

తప్పిన ప్రమాదం

పాణ్యం : మండల కేంద్రం పాణ్యంలోని జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. శనివారం సాయంత్రం కర్నూలు వైపు నుంచి నంద్యాలకు వెళ్తున్న కారు పాణ్యం బస్టాండ్ వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటో ఒక్కసారిగా హైవే నుంచి బ్రిడ్జి కిందకు కంప పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. రెండు వాహనాలు మాత్రం దెబ్బతిన్నట్లు పోలీసులు తెలిపారు.

హిందువులపై దాడులు ఖండించాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి అన్నారు. శనివారం కలెక్టరేట్ వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించడం పేరుతో బెంగాల్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఫలితంగా బెంగాల్ మొత్తం హింసాకాండతో రగిలిపోతోందన్నారు. హిందూ మత వ్యతిరేకులు విచ్చలవిడిగా దాడులను ప్రారంభించారన్నారు. ముర్షిదాబాద్‌లో ప్రారంభమైన భయంకరమైన హింస బెంగాల్ మొత్తం వ్యాపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సంపర్క కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు సందడి మహేష్, నాగరాజు, సాయిరాం, బజరంగ్‌దళ్ నాయకులు జంపాల నవీన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ

● అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి అవినాష్ జయసింహ


అగ్నిప్రమాదాల నివారణ జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు: వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకునే అవకాశమున్నందున ప్రజలు అగ్నిప్రమాదాల నివారణ అవగాహన కలిగి ఉండాలని ఆ శాఖ జిల్లా అధికారి అవినాష్ జయసింహ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు శనివారం కర్నూలు బళ్లారి చౌరస్తా సమీపంలోని అమీలియో హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అవినాష్ జయసింహ ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆసుపత్రుల్లో అగ్రిప్రమాదాలు జరిగినప్పుడు రెస్క్యూ ఆపరేషన్ ద్వారా రోగులను ఎలా కాపాడాలి, సురక్షిత ప్రాంతాలకు రోగులను ఎలా తరలించాలి, సిబ్బందిచే ప్రయోగపూర్వకంగా డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు లిఫ్ట్ వాడరాదని, మెట్ల మార్గం లేదా ర్యాంపుల ద్వారా రోగులను ఎలా బయటకు తీసుకురావాలో మాక్ డ్రిల్ చేసి చూపించారు. అగ్నిప్రమాదాల నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తలు ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి చిన్నబజారి, అమీలియో ఆసుపత్రి జనరల్ మేనేజర్ రమేష్, అగ్నిమాపక సిబ్బంది రంగస్వామి, జీసీ నరసింహులు, బాలాజీ నాయక్, లింగమూర్తి, మల్లేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ- వ్యర్థాలు పర్యావరణానికి హానికరం

– జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి


పాడైపోయిన కంప్యూటర్లు, ఇతర వస్తువులను రీ సైక్లింగ్‌కు సిద్ధం చేసిన అధికారులు

కర్నూలు(అర్బన్): ఈ- వ్యర్థాలు పర్యావరణానికి చాలా హానికరమని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉపయోగంలో లేని పనికిరాని ఈ- వ్యర్థాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉపకరణాలు విలువైన, ప్రమాదకరమైన పదార్థాలను కలిగి ఉంటాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, పరిపాలనాధికారులు సీ మురళీమోహన్‌రెడ్డి, రాంగోపాల్, జితేంద్ర, సరస్వతి, బసవశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయ సదన్‌లో..

కర్నూలు (సెంట్రల్): జిల్లా న్యాయ సదన్‌లో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులు స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. సంస్థ ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రం చేశారు. పేరుకుపోయిన చెత్తను బయటపడేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు.

ఈ-వ్యర్థాలు శాస్త్రీయంగా పారవేయాలి

కర్నూలు(హాస్పిటల్): ఈ-వ్యర్థాలు (వాడేసిన కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, టెలివిజన్ పరికరాల మొదలైనవి) శాస్త్రీయంగా పారవేయాలని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి ఈ-వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే ముప్పు గురించి వివరించారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ శైలేష్‌కుమార్, సంచార వాహన క్లినిక్ నోడల్ అధికారి డాక్టర్ రఘు, వైద్యాధికారి డాక్టర్ రామశిరీష, డెమో శ్రీనివాసులుశెట్టి, ఎస్.ఓ హేమ సుందరం, డీపీహెచ్ఎన్ఓ అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాయలంలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ ఎల్.భాస్కర్, అధికారులు, ఉద్యోగులు

కర్నూలు మెడికల్ కాలేజీలో...

కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ ఆధ్వర్యంలో కళాశాల పరిసరాలను సిబ్బంది శుభ్రం చేసి కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ అరుణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో క్లీన్ అండ్ గ్రీన్


చెత్తను తొలగిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కర్నూలు: స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా పోలీస్ స్టేషన్లలో పోలీసులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో, అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ ఆవరణంలోనూ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయ ఆవరణలోనూ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టి మైదానమంతా చెత్త చెదారం తొలగించి ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలు కొట్టేశారు.

ఈ - వ్యర్థాల పునర్వినియోగంతో మానవ మనుగడ సాధ్యం


ఈ - వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేస్తున్న మంత్రి భరత్

కర్నూలు (టౌన్): ఎలక్ట్రికల్ వస్తువుల పునర్వినియోగంతో మానవ మనుగడ సాధ్యమవుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్, జాయింట్ కలెక్టర్ బి. నవ్య హాజరయ్యారు. ఈ- వేస్టేజ్ పోస్టర్లను ఆవిష్కరించి సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అక్కడే ఈ-వేస్ట్ సేకరణ మొబైల్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ-చెక్ గ్రీన్ వాక్ ర్యాలీ నిర్వహించారు. స్థానికంగా అశోక్‌నగర్ కేసీ కెనాల్ వద్ద పాకెట్ పార్కు వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలో ఈ- వేస్టేజ్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం ఒక కొత్త నినాదం అమలులోకి తీసుకుని వస్తున్నట్లు చెప్పారు. ఈ వేస్ట్ కెమికల్స్, ప్లాస్టిక్‌ను సమర్థవంతంగా ఎదుర్కొందామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రబాబు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ ఈఈ కిశోర్ రెడ్డి, పాల్గొన్నారు.

పోషకాహార భారత్‌ను నిర్మించడమే లక్ష్యం


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): పోషకాహార భారత్‌ను నిర్మించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పోషణ్ పక్వాడ 2025 కార్యక్రమాన్ని చేపట్టిందని ఐసీడీఎస్ సీడీపీఓ అనురాధ, క్షేత్ర ప్రచార సహాయకులు ఫణికుమార్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన పోషణ్ పక్వాడ కార్యక్రమాల్లోభాగంగా శనివారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఐసీడీఎస్ సంయుక్తంగా స్థానిక నిర్మలానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ్ అభియాన్ శిశువు జీవితంలోని మొదటి 1000 రోజుల పౌష్టికాహారం ప్రాముఖ్యతను, పోషణ్ ట్రాకర్ ఉపయోగాన్ని వివరించారు. కార్యక్రమంలోనే భాగంగా పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. అలాగే గర్భిణులకు సీమంతాలు, పౌష్టికాహార కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఐకమత్యంతో పోరాడుదాం


కార్నర్‌మీటింగ్‌లో పాల్గొన్న ముస్లిం సంఘాల ప్రతినిధులు

కర్నూలు(సెంట్రల్): నూతన వక్ఫ్ చట్టం రద్దు అయ్యే వరకు ఐకమత్యంతో పోరాడుదామని రిటైర్డ్ ప్రిన్సిపాల్ నిస్సార్ అహ్మద్ పిలుపునిచ్చారు. మూడో రోజు శనివారం సేవ్ వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో పాతబస్తీలో వక్ఫ్ చట్ట సవరణ రద్దు కోసం పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్ దేశాయ్, ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం అసోసియేషన్ నాయకులు ఎంఏ హమీద్, జమాతే ఇస్లామి ఏ హింద్ నాయకులు పీఎస్ మున్నీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు పలువురు వినతి పత్రాలు సమర్పించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసే జీవో నెం.107, 108ని రద్దు చేయాలని, ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణం వెంటనే చేపట్టాలని, మెడికల్ కాలేజి, ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న ఆలోచన విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు.

● ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే పారిశుద్ధ్యకార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి నెలకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, బకాయిపడిన బిల్లులను కాంట్రాక్టర్లకు వెంటనే చెల్లించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి మునెప్ప కోరారు.

● రాష్ట్ర ప్రభుత్వం అద్దె వాహనాలు రద్దు చేసి, వాటి స్థానంలో ప్రభుత్వ వాహనాలు సరఫరా చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షులు వై. నాగేశ్వరరావు కోరారు.

● స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పారిశుద్ధ్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని, నూతన డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయాలని జీజీహెచ్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు పీటీ సాయిప్రదీప్ కోరారు.

● ఆయుష్ విభాగంలోని ఆసుపత్రుల్లో వైద్యులను ఏపీపీఎస్సీ ద్వారా కాకుండా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆంధ్ర హోమియోడ్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎ.జగన్ మోహన మూర్తి శనివారం కర్నూలులో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ నాయకులు ఎ.ఇమ్మత్, దేవి తదితరులు ఉన్నారు.

అత్యున్నత స్థాయికి చేరుకోవాలి

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల విద్యార్థినిలు కష్టపడి చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్, సమగ్ర శిక్ష అద నపు కో-ఆర్డినేటర్ టి.శ్రీనివాసులు అన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన బాలికలను సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీలు పేద విద్యార్థినుల పాలిట వరంగా మారాయన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతో మంది బాలికలు ఉన్నత చదువులు, ఉద్యోగాలకు ఎంపికైన వారు ఉన్నారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, సమన్వయంతో పని చేసిన స్పెషల్ ఆఫీసర్లను ఘనంగా సన్మానించారు.

ఫూలే సినిమాపై అభ్యంతరాలను ఎత్తివేయాలి


మాట్లాడుతున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): భారత దేశంలో వేళ్లానుకుపోయిన కుల వ్యవస్థ, బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మానవతావాది మహాత్మా జ్యోతిరావు ఫూలే సినిమాపై ఉన్న అభ్యంతరాలను ఎత్తివేయాలని జిల్లా కురువ సంఘం నేతలు కోరారు. శనివారం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధనుంజయ, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, కోశాధికారి కేసీ నాగన్న మాట్లాడుతూ అగ్రవర్ణాల దశ్చర్యలకు అద్దం పట్టేదిగా ఈ సినిమాలో అనేక సన్నివేశాలు ఉన్నాయన్నారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం మతాన్ని, సమాజాన్ని భ్రష్టు పట్టించిన మనువాదుల దౌర్జన్యాలను ఒంటరిగా ఎదుర్కొన్న ధీశాలి ఫూలే అన్నారు. మనుషులందరిని పుట్టించిన వాడు దేవుడైనప్పుడు వ్యక్తికి వ్యక్తికి తేడా లేదనే సారాంశంతో తీసిన చిత్రంపై ఎందుకు అభ్యంతరాలు చెబుతున్నారని ప్రశ్నించారు. అనంత్ మహదేవన్ ఆధ్వర్యంలో ప్రముఖ నటులు ప్రతీక్ గాంధీ పత్రలేఖ ప్రధాన పాత్రల్లో ఫూలే సినిమాను రూపొందించారన్నారు. దీన్ని అగ్రవర్ణ కులానికి చెందిన వారు వ్యతిరేకించడం దారుణమన్నారు. ఈ సినిమాకు ఉన్న అడ్డంకులను తొలగించి సభ్య సమాజానికి మంచి సందేశాన్ని అందించనున్న ఈ సినిమాను వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.